
# పచ్చగడ్డి భగ్గుమంది



**సం**జె వేళ.

పేర్లపంజా వెనకాల ఖాళీ స్థలంలో పచ్చగడ్డి మూటలు ఒక్కొక్కటే వస్తున్నాయి. ఆడవాళ్ళు పొద్దుననగా పొలాలకు పోయి గట్లమీదా, బీళ్ళ పక్కా పచ్చగడ్డి కోసుకుని అమ్మకానికి తీసుకొస్తున్నారు. వస్తూ వస్తూ దోవలో ఇళ్ళదగ్గర మూట దింపుకుని ఇంత మొహం కడుక్కుని, ఇంత బొట్టు పెట్టుకుని ఆ ఖాళీ స్థలానికి చేరుకుంటున్నారు.

వలయంగా పచ్చగడ్డి-కుప్పలు. ఆ కుప్పల వెనకాల రంగు రంగుల చీరలు కట్టుకుని "రండి! రండి" అని పిలిచే కొమ్మలు. కొందరు పచ్చగడ్డి కొనటానికి వస్తారు, కొందరు ఆ పిలుపులందుకోటానికి వస్తారు.

"ఓ అయ్య ఇటు."

"ఈ గడ్డి చూడయ్యా!"

"లేత గడ్డయ్యా! గొడ్లకింక తవుడెయ్యక్కర్లా!" ఇలా కేకలు.

లచ్మి ఆలస్యంగా వచ్చింది. గడ్డి కుప్పబోసి నుంచుందంతే. అందరిలా కేకలెయ్యదు. ఏదో ధరకి ఎవరో ఒకళ్ళు కొంటే మూటెత్తుకెళ్ళి వాళ్ళ దొడ్లో వేస్తుంది. లచ్మి రాకపోతే ఆ చోటుకి కళ లేదు. చిలకాకు పచ్చచీర కట్టుకుని నుదుట పెద్ద కుంకంబొట్టుతో వస్తూనే నవ్వుతూ అందర్నీ పలకరిస్తుంది. "ఓ లప్పొ బుల్లిగాడు బడికెళ్తున్నాడంటే?" "ఓ నూకాలు పిన్నీ! అయ్యకి సులువుగా ఉందా!" "ఓ లబ్బో! సీతాలప్పుడే పవిటలేస్తందే ....." ఇలా అందరిలో కలిసిపోయేది.

వయసులో ఉన్న లచ్మి మిలమిల్లాడే కళ్ళతో గలగల నవ్వుతూ అందర్నీ పలకరిస్తుంటే మొగాళ్ళ కళ్ళన్నీ లచ్మి మీదే. కాని లచ్మితో సరసమాడాలంటే భయం. ఒకసారి పోలాయి లచ్మి దగ్గర కొచ్చి-

"గడ్డి బావుందే" అన్నాడు.

"తీసుకో బాబూ" అంది లచ్మి.

"ఎంత ధర?"

"మామూలే గద బాబూ! ఓ రూపా యిప్పించండి."

"రూపాయేనంటే నీ ధర! ఐదు రూపాయిలిస్తా తీస్కో."

'బాబూ గడ్డి గొడ్లకా? మీకా?" అంది లచ్మి.

ఆ మాటతో పోలాయి బిల్లబీటుగా పడిపోయి మొహం మాడ్చుకుని వెళ్ళిపోయాడు. అప్పట్నుంచి లచ్మితో ఎవరూ ఎకసక్కాలాడరు.

అప్పుడే కొన్ని మూటలు బేరం కుదిరి వెళ్ళిపోతున్నాయి. లచ్మి మూటకు బేరం రాలేదు. గడ్డి పైపైకి కుప్పగా పోస్తూ నుంచుంది. ఈ రూపాయితో అర్ధరూపాయి నూకలు కొని అర్ధరూపాయి తండ్రి తాగుడికివ్వాలి. లచ్మి తండ్రికి పెళ్లాం పోయింతర్వాత కూతురే ఆధారం. కూతురి కంటే తాగుడు మరింత ముఖ్యం.

సంవత్సరం క్రితం లచ్మి ఇంతసేపు నుంచునే పని లేదు. ఆ మూట ఇంకోళ్ళు కొనే పని లేదు. అది రాములు మూటే. లచ్మి ఆలోచనలు రాములు మావమీద కెళ్ళాయి. అప్పట్లో రాములు మావ పున్నయ్యగారింట్లో పాలేరుగా ఉండేవాడు. తను గడ్డి కోసుకోటానికి పాలాలకెల్తే అతగాడు గొడ్లని తోలుకుని పాలాలవైపు కొచ్చేవాడు. గొడ్లని బీట్లో వదిలేసి తన్ని వెతుక్కుంటూ వచ్చి తనతోపాటు గడ్డి కోసిపెట్టేవాడు. పొద్దు నడినెత్తికొచ్చాక తను తెచ్చుకున్న బువ్వ మూట్ని లచ్మికి పంచేవాడు. కుంటలో ఇద్దరూ నీళ్ళుతాగి మర్రిచెట్టుకింద వూసులాడుకునేవాళ్ళు. సాయంత్రం లచ్మి గడ్డిమూట కట్టి తలకెత్తమంటే తమాషా చేసేవాడు. బరువు బరువని సగం ఎత్తి మూట వదిలేసేవాడు. లచ్మి ఒకటే నవ్వు. అలా ఐదారుసార్లు వొదిలేసి మూట లచ్మి తలకెత్తి దగ్గరిగా జరిగేవాడు. వొంటికి వొళ్ళంటుకునే వేళ లచ్మి మూతి బిగించి "పో! మావా!" అని గడ్డిమూటతోనే అవతలకి తోసేది. రాములు నవ్వుకుంటూ లచ్మి జడలాగేవాడు. రోజూ ఇదే వరస! డొంకలో నడుస్తూ కబుర్లాడుకుంటూ వూళ్ళోకొచ్చేవారు. లచ్మి సరాసరి పీర్లపంజా దగ్గరకొస్తే రాములు కొట్టంలో గొడ్లని కట్టేసి గడ్డి మూటల దగ్గరకొచ్చేవాడు. యజమానిచేత ఓ పావలా ఎక్కువిప్పించి లచ్మి మూటనే కొనేవాడు.

"మావా! ఇందులో సగం గడ్డి నువ్వు కోసిందే కదా! నీ కట్టం నాకిస్తున్నావా?" అని లచ్మి అంటే "నా బతుకే నీకు దారపోస్తున్నాను గదే" అనేవాడు రాములు.

రాములు తన బతుకు లచ్మికి ధారపొయ్యలేదు. పెద్దల్ని కాదనలేక కట్నం డబ్బు అని భ్రమిసి సీతాలు మెళ్ళో తాళి కట్టాడు. ఆనాటినుంచి ఈనాటిదాకా

రాములు లచ్మి మొహం చూడలేదు. పాలేరుతనం మానేసి గేదెని కొనుక్కొని పాలమ్ముకుంటున్నాడు. లచ్మి నాకింతే ప్రాప్తం అనుకుంది. మనసు కుదుర్చుకుని నవ్వుతూ బతుకుతోంది.

లచ్మి తండ్రి కూతురికి సంబంధాలు వెతక్కపోగా లంచం తిని అరవై యేళ్ళ ముసలోడికి మూడో పెళ్ళాంగా మనువు కుదిర్చాడు. రేపో మాపో లగ్గానికి బయల్దేరి పోవాలి. లచ్మి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"ఏం, లచ్మీ! మూటమ్మలేదా?" అనడిగాడు వెంకాయి.

"లేదయ్యా" అంది.

"నాకేసెయ్! రూపాయిపావలా ఇస్తాను" అన్నాడు.

మూటెత్తుకుని లచ్మి నడుస్తుంటే వెంకాయి తనింటికి కాక రాములింటికి దోవతీశాడు. లచ్మే రాములు గుమ్మంముందు ఆగి "నీక్కాని వస్తువు నువ్వెందుకు కొనుక్కున్నావయ్యా?" అంది. వెంకాయికి తెలిసిందో లేదో తెలియదు. గడ్డి దొడ్లో వేయించి రెండు రూపాయలు చేతిలో పెట్టాడు. అంతలో రాములు పెళ్ళాం సీతాలు వాకిట్లో కొచ్చి లచ్మికి బొట్టుపెట్టి "నీకు పెళ్ళంటగా" అంటూ రవికిల గుడ్డ, పసుపు, కుంకం చేతికిచ్చింది. లచ్మికి కళ్ళు నీళ్ళయిపోయినాయి.

"రాములు మావున్నాడా! దణ్ణవెట్టి ఎడతాను" అంది. 'ఆ' అని సీతాలు లోపలికెళ్ళిందిగాని అప్పటికే రాములు దొడ్లోంచి బయటకెళ్ళిపోయాడు. లచ్మి దిగులుగా ఇంటికొచ్చేసింది.

లచ్మి తండ్రి తాగుడికి లచ్మి సంపాదన ఎంతవసర మనుకున్నాడో భగవంతుడు లచ్మిని ఆర్నెలల్లో పుట్టింటికి రప్పించేశాడు. మళ్ళీ గడ్డి మూటతో సాయంత్రం పీర్ల పంజా వెనకాల స్థలంలో వచ్చి నుంచుంది లచ్మి.

ఇప్పుడా లచ్మి ముఖంలో నవ్వు లేదయ్యా!

ఇపుడా లచ్మి ముఖంలో బొట్టు లేదయ్యా!*